క్లుప్తంగా

నేడు బొౖద్రాయి 13వ వార్షికోత్సవ పూజలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలో బొౖద్రాయి 13వ వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు బొౖద్రాయి చైర్మన్ పోగుల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బొౖద్రాయి వద్దకు బోనం, నైవేద్యాలు, కొబ్బరికాయలను, నీళ్ల బిందెలతో వచ్చి అమ్మవారికి సమర్పించాలని ఆయన కోరారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేకాలు, 9 గంటల నుంచి 11 గంటల వరకు అలంకరణ, నైవేద్యాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయాలని కోరారు.

తాపీమేస్త్రీలకు ఉపకరణాల పంపిణీ



కన్నాయిగూడెం: మండలంలో సిమెంట్ పనులు చేసి భవనాలు నిర్మిస్తున్న కార్మికులకు విశ్వకర్మ పథకం కింద రుణం పొందిన వారికి బీజేపీ మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఉపకరణాలను అందించారు. మండలంలో విశ్వకర్మ ట్రైనింగ్ పొందిన మేస్త్రీలకు రూ.25 వేల విలువ చేసే శుక్రవారం మండలంలోని బుట్టాయిగూడెంలో లబ్ధిదారులకు ఉపకరణాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనగం ఆనంద్, కుమ్మరి శ్రీనివాస్, బీరెల్లి సంతోష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

వాజేడు : రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి ముంజ మహేశ్ ఒక ప్రకటనలో కోరారు. 2025 సంవత్సరానికి గాను 5 జూన్ 2025 కంటే ముందు భూ భారతిలో పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంట్ జిరాక్స్ ప్రతులను జతచేయాలని తెలిపారు. దరఖాస్తులను జూన్ 20 లోగా ఏఈఓలకు ఇవ్వాలన్నారు.

రెవెన్యూ సదస్సుకు భారీ స్పందన



ధర్మవరం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వాజేడు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు భారీ స్పందన లభించింది. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులను కుమారస్వామి నిర్వహించారు. సదస్సులకు రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందజేశారు.

పేదవాడి కలను నెరవేర్చిన మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం : జిల్లాలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు అందజేసి వారి కలను మంత్రి సీతక్క నెరవేర్చిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదల కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సీతక్క ద్వారా నియోజకవర్గానికి 5 వేలు ఇళ్లు మంజూరు చేయించారన్నారు. మరో వెయ్యి కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షులు ఎండీ సులేమాన్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వినయ్, మాజీ ఉపసర్పంచ్ అరుణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నవీన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్నె సత్యం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అమ్మితే కేసులు

చిట్యాల: పీడీఎస్ బియ్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న ఉచిత సన్న బియ్యాన్ని లబ్ధిదారులు దళారులకు అమ్ముకున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లుయితే సంబంధిత లబ్ధిదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టి వారి రేషన్‌కార్డు తొలగిస్తామని అన్నారు.

షెడ్డు లేక.. ఎండలోనే వాహనాలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- టెండర్లు అయినా ప్రారంభానికి నోచుకోలేదు



బైక్‌స్టాండ్‌కు తాళం వేసి ఉండడంతో బయటనే పార్కింగ్ చేసుకున్న వాహనదారులు

ఏటూరునాగారం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు నిలుపుకునే బైక్‌స్టాండ్ ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు వారి ద్విచక్రవాహనాలను బస్టాండ్‌లో ఎండలో పెట్టి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి వస్తోంది. ఛత్తీస్‌గఢ్, హైదరాబాద్, గుంటూరు తదితర దూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. అయితే 2024 డిసెంబర్ 28 కు గత టెండర్ అగ్రిమెంట్ పూర్తయిన తర్వాత ఫిబ్రవరిలో టెండర్లు ఆహ్వానించగా టెండర్లలో ఎక్కువ కోడ్ చేసిన మండల కేంద్రానికి చెందిన బట్టు రమేష్ తనకు అగ్రిమెంట్ అయింది. అయితే బైక్‌స్టాండ్ నిర్వహణ గిట్టుబాటు కావడం లేదని ఆర్టీసీ అధికారులకు రాతపూర్వకంగా రమేష్ రాసి ఇచ్చారు. బైక్‌స్టాండ్‌ను వేరొకరికి అప్పగించాల్సిన ఆర్టీసీ అధికారులు జాప్యం చేస్తున్నారు. టెండర్లను వెంటనే ఆహ్వానించి బస్టాండ్ బైక్ షెడ్డును తెరిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రక్షణ కరువు

బైక్‌లను తాళం వేసి బస్టాండ్‌లో పక్కకు బయట పెట్టడంతో అందులో నుంచి పెట్రోల్ మాయం అవుతుందని, బైక్‌కు ఉన్న వస్తువులను దొంగిలించుకపోతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైక్ స్టాండ్ అప్పగించే విషయంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వీడి వెంటనే సెకండ్ కోడ్ చేసిన వ్యక్తులకు బైక్‌స్టాండ్ అప్పగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

బైక్‌స్టాండ్ తెరిపించాలి



బైక్ స్టాండ్ లేక వాహనాలను ఎండలో పెట్టి బస్సులో వరంగల్, తదితర ప్రాంతాలకు పోవాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదు. బస్సులో ప్రయాణించే వారికి బైక్‌ను ఏర్పాటు చేసుకునే షెడ్డు కూడా ఇవ్వలేని దీనస్థితిలో అధికారులు ఉండడం సిగ్గుచేటు.

– కృష్ణారావు, వాహనదారుడు

పెట్రోల్ మాయం



బైక్‌లను అక్కడ నిలిపి హైదరాబాద్‌కు వెళితే వచ్చే వరకు అందులో పెట్రోల్ ఉండడం లేదు. బైక్‌కు ఉన్న వస్తువులు పోతున్నాయి. ఇలా ఎన్ని రోజులని ఇబ్బంది పడాలి. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఏ మాత్రం కూడా పట్టించుకోకుండా మొద్దునిద్రలో ఉండడం బాధాకరం.

– రాంబాబు, రొయ్యూర్, వాహనదారుడు

సకాలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

- ఏటూరునాగారం ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

ఏటూరునాగారం : మండలంలోని ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు సకాలంలో ఇళ్లను నిర్మించుకోవాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలను పొందిన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తక్కువ ధరకు సిమెంట్, కంకర, ఇతర సామగ్రి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుందన్నారు. పనులు ఆలస్యంగా జరగకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం స్థితిగతులను పట్టి బిల్లులు వెంటనే ఇవ్వడం జరుగుతుందన్నారు. పనుల్లో ఆలస్యం లేకుండా చేసుకోవాలన్నారు. దళారులకు నమ్మి డబ్బులు ఇవ్వడం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిత

లబ్ధిదారులకు అవగాహన సదస్సు

కన్నాయిగూడెం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించకోవాలని ఎంపీడీఓ అనిత అన్నారు. మండలంలోని రైతు వేదికలో ఇదిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు తగ్గకుండా ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఎంపీఓ సాజిదా బేగం, ఇరిగేషన్ డీఈ శరత్‌బాబు హౌసింగ్ ఏఈ నితిన్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు కొమ్మలు



వాజేడు : మండలకేంద్రం నుంచి గుమ్మడిదొడ్డికి వెళ్లే దారిలో రహదారికి అడ్డంగా చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. రహదారికి మధ్యలో చెట్టుకొమ్మలు పడి ఉండటంతో ప్రమాదకరంగా ఉన్నాయి. కొమ్మలు విరిగి పడి 5 రోజులు అయినప్పటికీ వాటిని ఎవరూ తొలగించడం లేదు. ఏ ప్రమాదం జరగక ముందే చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం

మంగపేట : మండంలోని చెరుపల్లి గ్రామపంచాయతీ అధికారులు పారిశుద్ధ్యం తొలగించడంపై శ్రద్ధ చూపక పోవడంతో అంతర్గ రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు గ్రామంలో వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో పాటు రోడ్ల వెంట జనావాసాల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిలిచి కంపు కొడుతున్నాయి. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక పక్క వర్షాలు పడుతుండటంతో రోడ్లపై పేరుకుపోయిన మురుగు నీరు, పారిశుద్ధ్యం వలన దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పేరుకుపోయిన పారిశుధ్యం తొలగించి మురుగు నీటిని బయటకు పంపించే విదంగా చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెరుపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాల మలుపు వద్ద నిలిచి ఉన్న మురుగునీరు

ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం



పలిమెల : మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక

- ఐసీడీఎస్ గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ వీణ

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం అందిస్తున్నామని ఐసీడీఎస్ గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ వీణ అన్నారు. మండలంలోని గంగారం సెక్టార్ పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, విద్య గూర్చి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పలిమెల: అంగన్‌వాడీ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలను గుర్తించి ప్రతీ ఒక్కరిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించేలా చూడాలని సిబ్బందికి సీడీపీఓ రాధిక సూచించారు. శుక్రవారం మండలంలోని బూరుగూడెం, పంకెనల్లో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించడానికి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అవసరమైన బోధన సామగ్రి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.



కాటారం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)లో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, అనిత నిర్వహించారు. చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చే ర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటను వేయాలని అన్నారు.

దుస్తులు, పుస్తకాల పంపిణీ

వాజేడు : మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు దామోదర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా క్రమశిక్షణతో బడికి రావాలన్నారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

- వైద్యాధికారిని గ్నానస

వాజేడు : పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచు కోవాలని ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారిని గ్నానస అన్నారు. కలెక్టర్ దివాకర, జిల్లా వైద్యాధికారి గోపాలరావు ఆదేశాల మేరకు మండలంలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 52 మంది రోగులను పరీక్షించి మందులను అందించడంతో పాటు పలు సూచనలను చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలను అరికట్టడం మూలంగానే జ్వరాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని వివరించారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ జ్వరాల తీవ్రత తెలుసుకునే ప్రయత్నం చేశా రు. కార్యక్రమంలో కోటిరెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసరావు, కన్యాకుమారి, కాంత తదితరులున్నారు.



బొల్లారంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండ

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి



ఎస్ఎస్‌తాడ్వాయి: ఐలయ్య చిత్రపటం నివాళులర్పిస్తున్న బడే నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి : బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని లవ్వాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎట్టి ఐలయ్య కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆమె పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, నాయకులు నాలి రామారావు, ఈసం సాంబయ్య, సంతోష్, నాలి నాగలక్ష్మి, వట్టం లక్ష్మయ్య, పాయం కన్నయ్య, సిద్దు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి రాజు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు రాజు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట నాయకులు చింతనిప్పుల భిక్షపతి, రాజన్న, మహేందర్, అభినయ్, రాకేష్ ఉన్నారు.



రాజు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇటీవల మరణించాడని, అతడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ.5వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు తెలిపారు. పరామర్శించిన వారిలో చేల వినయ్, ఖలీల్, ఎల్లయ్య, రవి, రాములు, రాజేష్, రవీందర్, రాజు, రాఘవయ్య, సత్యనారాయణ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ములుగు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మల్లంపల్లి మండలం మంచినీళ్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దిలీప్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కమరున్నిసా , పాఠశాల ఉపాధ్యాయుడు ఉమాశంకర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కన్నాయిగూడెం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు హెచ్ఎంల ఆధ్వర్యంలో వారికి సామూహిక అక్షరాభ్యాసం చేశారు. మండలంలోని లక్ష్మీపురం, బుట్టాయిగూడెం చింతగూడెం, ముప్పనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎంలు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో ఎస్సై ఇనిగాల వెంకటేష్ హాజరై విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. బుట్టాయిగూడెంలో ప్రధానోపాధ్యయురాలు ప్రజ్ఞ అక్షర అభ్యాసం చేశారు.

వెంకటాపురం(కె): మండలంలోని బెస్తగూడెం పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారావు, కల్యాణి , ఉషారాణి, రమణ, రాజు, రవి తదితరులు ఉన్నారు.



కన్నాయిగూడెం : లక్ష్మీపురంలోని ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఎస్సై వెంకటేశ్



వెంకటాపురం (కె) : విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ములుగు రూరల్ : మంచినీళ్లపల్లి పాఠశాలలో అక్షరభ్యాసం చేసిన ఉపాధ్యాయులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామానికి చెందిన దొడ్ల రమణారెడ్డి ఎనిమిది నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి శుక్రవారం హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి అందజేశారు.

ఎస్సైకి సన్మానం

ఏటూరునాగారం : స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజ్‌కుమార్‌ను బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. బీఆర్ఎస్ యువజన సంఘం విభాగం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఎస్సైకి వివరించారు. ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కిషోర్, యశ్వంత్, రాఖి, శ్రీనివాస్, సతీష్, రాజ్‌కుమార్, వెంకట్, రాజేష్, అరుణ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్సై సతీష్

వాజేడు: స్థానిక పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా జక్కుల సతీష్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న రాజ్‌కుమార్ ఏటూర్‌నాగారం బదిలీ కాగా ఆయన స్థానంలో వెంకటాపూర్ ఎస్సైగా పని చేస్తున్న సతీష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.



ఏటూరునాగారం : ఎస్సైని సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులు

ఎస్సై బాధ్యతల స్వీకరణ

వెంకటాపురం(ఎం): స్థానిక ఎస్సైగా శుక్రవారం చల్లా రాజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెంకటాపురం ఎస్సైగా పనిచేసిన చల్లా రాజు రెండో సారి వెంకటాపురం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు ఎస్సై రాజును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి సామాజిక తనిఖీలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు నేటి(శనివారం) నుంచి స్టేట్ రిసోర్స్ పర్సన్ గంగరాజు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పర్యటించి తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు చేసిన చెల్లింపుల వివరాలను ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఆయన శుక్రవారం వెల్లడించారు. రూ.4,65,62,098 పనులకుగాను వేతన రూపంలో రూ.3,32,24,593లు, మెటీరియల్ రూపంలో రూ.1,33,37,505లను చెల్లింపులు చేసినట్లు తెలిపారు. చెల్లింపులు చేసిన డాక్యుమెంట్లు పూర్తిగా ఆడిట్ బృందానికి మూడు రోజులపాటు అప్పగించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి తనిఖీ బృందం పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, కొలతలను చూసి, పనిచేసిన జాబు కార్డుదారులను వ్యక్తిగతంగా కలిసి తనిఖీ నిర్వహించనున్నారు. పీఓ సునీత, రమేశ్, ఎస్ఆర్పీ గంగరాజు ఉన్నారు.